క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సీఐ రామకృష్ణ



ట్రాఫిక్ గుర్తులను వివరిస్తున్న సీఐ రామకృష్ణ

సిద్దిపేటరూరల్: ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థి దశ నుంచి పాటించడంవల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సూచించారు. గురువారం మండల పరిధిలోని రాఘవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని, చట్టప్రకారం నేరమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజుభార్గవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పరీక్ష



ప్రతిభా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి సాంఘిక శాస్త్రం ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. శైలజ, విక్కి (అనంతసాగర్), బాలకృష్ణ(పెద్దకోడూరు), మహేందర్ (అల్లీపూర్) ఈనెల 3వ తేదీన సిద్దిపేటలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు లక్ష్మయ్య, రవీంద్ర కుమార్, ఎంఎన్‌ఓ తిరుపతి, సోషల్ స్టడీ ఫోరం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రమేష్

తొగుట(దుబ్బాక): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మండల కార్యవర్గాన్ని గురువారం ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాంపురం రమేష్, ఉపాధ్యక్షుడిగా కాసర్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా ఆకారం కిషన్, కార్యదర్శిగా కాసర్ల కరుణాకర్, ప్రచార కార్యదర్శిగా జిర్ర స్వామి, కోశాధికారిగా గొల్లపల్లి భిక్షపతి ఎన్నికయ్యారు.

సభలు జయప్రదం చేయాలి

నంగునూరు(సిద్దిపేట): ఖమ్మంలో జరిగే టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.కనకయ్య పిలుపునిచ్చారు. గురువారం నర్మేట ఉన్నత పాఠశాలలో ఎంఈఓ దేశిరెడ్డితో కలసి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11, 12వ తేదీల్లో ఖమ్మంలో జరిగే మహాసభకు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పలువురు మంత్రులు హాజరవుతారన్నారు. సామాజిక, సాంస్కృతిక సమాజ నిర్మాణం, విద్య ప్రజల హక్కు, ప్రభుత్వ బాధ్యత అంశంపై వక్తలు ప్రసంగిస్తారని తెలిపారు.

నూతన కమిటీల ఎన్నిక

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగ రాజమల్లు, ఉపాధ్యక్షుడిగా ఇస్కిల్ల ఐలయ్య, కార్యవర్గ సభ్యులుగా జెల్ల ప్రభాకర్, మిదుదుల బాలయ్య, రొడ్డ మల్లేశం, బోనాల లింగయ్య, మొగిలి రమేష్, ఎల్లయ్య, లచ్చయ్య, బాలమల్లు, కనకయ్యను ఎన్నుకున్నారు.

గుగ్గిల్లలో..

బెజ్జంకి మండలంలోని తిమ్మాయపల్లె కృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా కల్లూరి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా మ్యాకల శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా మేకల శ్రీధర్, కార్యదర్శిగా కల్లూరి రమేష్, కోశాధికారిగా కల్లూరి నరేందర్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గుగ్గిల్ల కృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా కుంబం తిరుపతి, ఉపాధ్యక్షుడిగా దుగ్యాని ఎల్లయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

గావ్ చలో.. బస్తీ చలో

దుబ్బాకటౌన్: కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గావ్ చలో..బస్తీ చలో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేష్‌గౌడ్ తెలిపారు. గురువారం దుబ్బాకలో గావ్ చలో..బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

అవిశ్వాస భయం పట్టుకుంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజులకు అవిశ్వాస భయం పట్టుకుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు రెండు వర్గాలుగా విడిపోయారన్నారు. ఓ వర్గం కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండటం మున్సిపల్ నిధులు అందరికీ సమానంగా ఇవ్వకపోవడమేనని ఆరోపించారు. ఈ విషయాన్ని మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకుపోయామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట యువజన పట్టణ అధ్యక్షుడు గయాజుద్దీన్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచ్‌లు కీలకం

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



అక్కన్నపేట మండల కేంద్రంలో సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి ని సన్మానిస్తున్న అధికారులు, గ్రామస్తులు

గజ్వేల్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు, గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గజ్వేల్ ఐవోసీలోగల సమావేశ హాల్‌లో గురువారం ఎంపీపీ అమరావతి ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కృష్ణాగౌడ్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, తహసీల్దార్ బాల్‌రాజు, ఎంపీడీవో మచ్చేందర్, పాల్గొన్నారు.

ప్రజలతో అనుబంధం మరువలేనిది

హుస్నాబాద్‌రూరల్: ప్రజాప్రతినిధిగా ప్రజలతో ఉన్న అనుబంధం మరువలేనిదని సర్పంచ్‌లు అన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వారికి ఎంపీపీ లకావత్ మానస సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడారు. ఐదేళ్ల ప్రజాపాలనలో నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ గ్రామాల అభివృద్ధికి పని చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవేంద్రరెడ్డి, ఎంపీఓ సత్యనారాయణ, సర్పంచ్‌లు రమేష్, మల్లయ్య, బాలస్వామి, గంగము మధు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా

మద్దూరు(హుస్నాబాద్): తనను ధర్మారం సర్పంచ్‌గా గెలిపించి సేవ చేసే భాగ్యాన్ని కల్పించినందుకు గ్రామ ప్రజలకు రుణపడి ఉంటానని సర్పంచ్ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. తనను సర్పంచ్‌గా గెలిపించినందుకు గ్రామస్తులు, తనకు సహకారించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి

తొగుట(దుబ్బాక): సర్పంచ్‌గా ప్రజలకు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గుడికందుల గ్రామ పంచాయితీ పాలకవర్గం సన్మాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ మల్లయ్య గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అనంతరం సర్పంచ్, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈవో దేవేందర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ బైరాగౌడ్, మాజీ సర్పంచ్ రమేష్ గౌడ్, విద్యాకమిటీ చైర్మన్ బాల్‌రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికంగా చితికి పోయాం

మిరుదొడ్డి(దుబ్బాక): అభివృద్ధి పనులు చేపట్టి ఆర్థికంగా చితికి పోయామని మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మిరుదొడ్డి ఎంపీడీఓ కార్యాలయంలో ఉమ్మడి మండల సర్పంచ్‌లకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వారిని అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఎంపీడీఓ రాజిరెడ్డి, ఎంపీఓ జహీరొద్దీన్, కో ఆప్షన్ మెంబర్ అహ్మద్, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, తుమ్మల బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

జీపీ పాలకవర్గానికి వీడ్కోలు

అక్కన్నపేట(హుస్నాబాద్): సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందుకు అక్కన్నపేటలో గురువారం సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, పాలకవర్గానికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఐదేళ్ల పాటు ప్రజలకు చేసిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి సబియా, కార్యదర్శి లక్ష్మీకాంతరావు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో సర్పంచ్, ఉప సర్పంచ్‌ల డిజిటల్ కీలను ఎంపీడీఓ, ఎంపీఓలకు అప్పగిస్తున్న కార్యదర్శులు

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు

డిజిటల్ కీలు అప్పగించిన కార్యదర్శులు

అక్కన్నపేట(హుస్నాబాద్): సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గురువారం సర్పంచ్, ఉప సర్పంచ్‌ల డిజిటల్ కీలను ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఎంపీఓ కవికుమార్‌లకు పంచాయితీ కార్యదర్శులు అప్పగించారు. సాయంత్రం ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు పదవీ బాధ్యతలను స్వీకరించారు.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గురువారం ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు.

కొమురవెల్లి(సిద్దిపేట): గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు వెలుబడిన వెంటనే పలువురు అధికారులు బాధ్యతలు స్వీకరించారు.

గజ్వేల్‌రూరల్: సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గురువారం ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు.

బీఐఎస్‌పై అవగాహన

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 9, 10వ తరగతి విద్యార్థులకు గురువారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించి అనంతరం రాత పరీక్ష నిర్వహించారు. నాణ్యత, భద్రత, విశ్వాసం, వస్తుసేవలపై నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

చేసిన పనులకే డబ్బు డ్రా చేశా

సర్పంచ్ లక్ష్మి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ లక్ష్మి

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు చేశానని, చేసిన అభివృద్ధి పనుల బిల్లుల డబ్బు మాత్రమే డ్రా చేసినట్లు సర్పంచ్ లక్ష్మి తెలిపారు. బుధవారం ఉపసర్పంచ్ మల్లేశం సర్పంచ్ పనులు చేయకుండానే, సమాచారం ఇవ్వకుండానే డబ్బులు డ్రా చేసినట్లు ఎంపీడీఓకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం సర్పంచ్ వార్డు సభ్యులతో కలిసి ఎంపీడీఓ పట్టాభిరామారావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన హయాంలో పలు అభివృద్ధి పనులు చేశామని, వాటికి సంబంధించిన డబ్బులు మాత్రమే డ్రా చేశానన్నారు. ఉపసర్పంచ్ ఉద్దేశపూర్వకంగా రాజకీయంగా బద్నాం చేయాలని లేనిపోని ఆరోపణలు చేశాడని చెప్పారు. అభివృద్ధి పనుల్లో అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. ఉపసర్పంచ్ ఆరోపణలన్నీ అవాస్తమని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు జనార్దన్‌రెడ్డి, రాము, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశం, రాహుల్ రెడ్డి, పాషా, నర్సింహారెడ్డి, ఆయూబ్ పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన ఉండాలి

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- ఎంపీపీ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

మద్దూరు(హుస్నాబాద్): వ్యవసాయ అధికారులకు పంటల సాగుపై కనీస అవగాహన ఉండాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజాశర్మ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా బెక్కల్, బైరాన్‌పల్లి సర్పంచ్‌లు, రేబర్తి ఎంపీటీసీ కూరెళ్ల రాజులు వరి పంటకు మొగి పురుగు ఆశిస్తోందని, నివారణకు అధికారులు చొరవ చూపాలన్నారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో జెడ్పీ చైర్‌పర్సన్ కలుగజేసుకొని ఏఏ గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న పంటలకు తెగుళ్లు ఆశించాయో తెలపాలని ప్రశ్నించగా అధికారుల నుంచి సమాధానం రాలేదు. ఆగ్రహించిన రోజా శర్మ కనీసం ఇద్దరి రైతుల పేర్లు చెప్పలేని స్థితిలో వ్యవసాయ అధికారులు ఉన్నారన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో మండలంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేవిధంగా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పీఏసీఎస్ సొసైటీ సమావేశాలకు ఆహ్వానాలు అందడం లేదని సర్పంచ్, ఎంపీటీసీ ప్రస్తావించారు. రోజాశర్మ కలుగజేసుకొని సమావేశాలకు ప్రజాప్రతినిధులు ఆహ్వానించాలన్నారు. పదవీ కాలం ముగిసిన సర్పంచ్‌లను సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వంట నిర్వాహకుల ఆందోళన

హుస్నాబాద్: హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో గురువారం వంట కార్మికులు, ఏజెన్సీ నిర్వాహకుల మధ్య ఘర్షణ పడ్డారు. గతంలో మధ్యాహ్న భోజన విషయంలో పిల్లలకు కారం భోజనం వడ్డించారని పాతవంట నిర్వాహకులపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పాఠశాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాతవారిని తొలగించి, కొత్తవారికి అప్పగించాలని ఆదేశించారు. ఎంఈఓ, తహసీల్దార్, ఎంపీడీఓలు సభ్యులుగా త్రిమెన్ కమిటీని నియమించారు. ఈ కమిటీ మోడల్ స్కూల్‌లో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి కొత్త వంట నిర్వాహకులతో మధ్యాహ్న భోజనం తయారు చేయించాని నిర్ణయించారు. కొత్త ఏజన్సీ నిర్వాహకులు మధ్యాహ్నం భోజనం వండుతున్న సమయంలో పాత నిర్వాహకులు వచ్చి గొడవకు దిగారు. దాదాపు 12 ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజనం వండుతూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, తమను ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. అనంతరం తమనే కొనసాగించాలని పాత నిర్వాహకులు ఎంఈఓకు వినతిపత్రం ఇచ్చారు.

పాఠశాల సందర్శన



ఉపాధ్యాయులను విచారిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గ హైస్కూల్‌ను గురువారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. తరగతులు ఎలా జరుగుతున్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదిలో అత్యధిక మార్కులు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, అందుకు అనుగుణంగా దాతల సహాయంతో అల్పాహారం అందేలా ఉపాధ్యాయులు దృష్టికి పెట్టాలని సూచించారు. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ నాడు గ్రామంలో జరిగిన ఉత్సవంలో విద్యార్థులు పాల్గొన్నారన్న విషయమై విద్యార్థి సంఘాలు ఫిర్యాదు చేయడంతో హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈఏడు పదిలో మండలం ఆదర్శంగా నిలిచేలా చర్యలు చేపట్టామన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కోర్టు జరిమానా విధించినట్లు సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ గురువారం తెలిపారు. పట్టణ కేంద్రంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ ఆఫీస్ చౌరస్తా, రాజీవ్ రహదారిపై పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 18 మందిని పట్టుకున్నారు. వారిని సిద్దిపేట అడిషనల్ జెఎఫ్‌సీఎం జడ్జి శ్రావణి ఎదుట హాజరుపరిచారు. విచారణ జరిపి రూ.28 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు

గజ్వేల్‌రూరల్: వాహనం ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన గజ్వేల్ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కోమటిబండకు చెందిన ప్రశాంత్ వృత్తిరీత్యా జేసీబీ డ్రైవర్. ద్విచక్ర వాహనంపై గజ్వేల్‌కు వచ్చిన ప్రశాంత్ పట్టణంలోని లక్ష్మణ్ గార్డెన్ సమీపంలోగల పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకొని వెళ్తున్నాడు. ఈ క్రమంలో గజ్వేల్ నుంచి తూప్రాన్ వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అతడి వాహనాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌పై అవగాహన

దుబ్బాకటౌన్: దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కేంద్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బడ్జెట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో 2024 కేంద్ర బడ్జెట్ సమావేశాలను వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

సిద్దిపేట టాస్క్ ఫోర్స్ సీఐగా బాధ్యతలు



సీపీ అనురాధకు పూల మొక్క అందజేస్తున్న సీఐ జానకిరాంరెడ్డి

సిద్దిపేటకమాన్: సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ నూతన ఇన్స్‌పక్టర్‌గా జానకిరాంరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా చేయడానికి టాస్క్ ఫోర్స్ కీలక పాత్ర పోషించాలన్నారు.

కరీంనగర్ ఎంపీ స్థానం బీజేపీదే

బెజ్జంకి(సిద్దిపేట): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బెజ్జంకిలో గురువారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికలలో 400 ఎంపీ స్థానాలతో మళ్లీ బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొలిపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

నంగునూరు(సిద్దిపేట): ఎమ్ఎస్ఎన్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేటలో నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్‌కు నలుగురు నంగునూరు జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కిషన్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ కళాశాలకు చెందిన నందిని, అక్షయ, అజిమ్, షాదుల్లా ఎంపికయ్యారన్నారు. తమ కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు క్యాంపస్ సెలెక్షన్ కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. అధ్యాపకులు జ్యోతి, భీమ్‌రావు, భరత్, కవిత, స్వామిగౌడ్, శ్రీలత, దేవయ్య, చారి, అశోక్, కృష్ణారెడ్డి తదితరులు విద్యార్థులను సత్కరించి అభినందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చేర్యాల(సిద్దిపేట): తమ పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచ్‌లు మండల సర్వసభ్య సమావేశంలో కోరారు. గురువారం ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో ఆయా శాఖలు అభివృద్ధిపై చర్చించారు. పలు గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడారు. తమ పదవీ కాలం ముగిసినందున తాము చేసిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి మంజూరయ్యేలా ఆదేశించాలని సభ దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీపీ కరుణాకర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ మహబూబ్ అలీ స్పందిస్తూ బిల్లులు తప్పకుండా చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశానికి హాజరైన జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజాశర్మ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల పాలనలో పల్లెలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. సమావేశంలో తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బెజ్జంకి ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ రాము**

బెజ్జంకి(సిద్దిపేట): సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రతేక అధికారులు నియమించింది. బెజ్జంకి గ్రామ ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ రాము గురువారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ **స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు విజయవంతం**

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు విజయవంతంగా నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్ని ప్రతిభ చాటారు. గెలుపొందిన విద్యార్థులు 13వ తేదీన జిల్లా స్థాయిలో జరిగే స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో పాల్గొంటారని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వాసుదేవ రెడ్డి తెలిపారు.

◆ **బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయం**

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ జలాల కోసం బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మార్చిలో నీటిని విడుదల చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందన్నారు. ప్రస్తుతం చెరువులు, చెక్‌డ్యాంల్లో నీరు నిల్వ ఉందన్నారు. రైతుల సమస్యలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకుపోతున్నామని తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు ఈనెల 2వ తేదీన మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేయాలని ఎస్ఈకి ఆదేశాలు జారీచేశారన్నారు. శుక్రవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తారని వివరించారు.

◆ **ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి**

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లి సమీప పార్శికుంట మెట్ల వద్ద ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్‌లోని ఐవోసీలోగల ఇరిగేషన్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

◆ **విద్యార్థి జీవితంలో కీలకం**

దుబ్బాకటౌన్: విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమని దుబ్బాక మండల విద్యాధికారి జోగు ప్రభుదాసు అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ధర్మాజీపేట పాఠశాలలో సాంఘిక శాస్త్రం ప్రతిభ పరీక్ష నిర్వహించారు.

◆ **దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి**

సిద్దిపేటఅర్బన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసిస్తూ ఈనెల 16వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ పిలుపు నిచ్చారు. గురువారం సిద్దిపేటలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు.

◆ **విద్యుత్ సరఫరా బంద్**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని లింగారెడ్డిపల్లి 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగారెడ్డిపల్లి, ఇందిరమ్మకాలనీ, ఇమాంబాద్, రేణుకానగర్, వీజేడీ కాలనీ, శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలన్నారు.

◆ **నైపుణ్యముంటే అవకాశాలు**

గజ్వేల్‌రూరల్: నైపుణ్యముంటే అవకాశాలు ఎక్కువ లభిస్తాయని ప్రొఫెసర్ ఉజ్జల్ ముఖర్జీ పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి ఆధ్వర్యంలో గురువారం శామీర్‌పేటకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ 'ఉద్యోగ అవకాశాలు-వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై డిగ్రీ, పీజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఉద్యోగం సంపాదించాలంటే ఏ విధంగా నైపుణ్యం సాధించాలి, భవిష్యత్ ప్రణాళికను ఏ విధంగా మలచుకోవాలనే అంశాలపై వివరించారు.

◆ **పంట నమోదు పకడ్బందీగా నిర్వహించాలి**

గజ్వేల్‌రూరల్: యాసంగి పంటల నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని డీబీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం గజ్వేల్‌లో మండల వ్యవసాయాధికారి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. పంటలు సాగుచేస్తున్న రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించక నష్టాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంటల నమోదు చేయకపోవడంతో విక్రయించే సమయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు.